ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా వై.ఎన్.భద్రం, అధ్యక్షునిగా పెంటకోట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాజాన దొరబాబు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా గనిశెట్టి ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా ఎం.అర్జున్ కుమార్, కోన లక్ష్మణ, కార్యదర్శులుగా ఎం.అప్పలరాజు, కండిపల్లి త్రినాథ్, కోశాధికారిగా రెడ్డిపల్లి అప్పలరాజుతోపాటు 13 మంది కౌన్సిల్ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్నికల పరిశీలకులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. అచ్యుతరావు, సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ వ్యవహరించారు.

స్వప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు

ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీకి మద్దతు ఇస్తున్న కూటమి, వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్పాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టడమేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. అనకాపల్లి జిల్లా ఏఐటీయూసీ ప్రథమ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో న్యూకాలనీలో జరిగిన మహాసభలో ముందుగా ఏఐటీయూసీ జెండాను చోడవరానికి చెందిన కళాసీల సంఘం సీనియర్ నాయకులు కిల్లి లక్ష్మయ్యతో ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఓబులేష్ మాట్లాడుతూ బీజేపీతో పొత్తు రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని పదే పదే చెబుతున్న చంద్రబాబునాయుడు బీజేపీ రాష్ట్రానికి ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజి, పోలవరం ప్రాజెక్టు వంటి విభజన హామీలను విస్మరించి రాష్ట్రానికి అన్యాయం చేస్తే ప్రశ్నించకుండా తమ అవసరాల కోసం పొత్తు పెట్టుకొని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీకి మద్దతు ఇస్తున్న కూటమి, వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలే సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను విధ్వంసం చేశారని, కార్మిక వర్గానికి మోడీ అనుసరిస్తున్న విధానాల వలన ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు లెక్కకు మించి తప్పుడు వాగ్దానాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజకీయ పార్టీలు మన మేనిఫెస్టోను విడుదల చేశాయని అందులో అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సంపదను సృష్టిస్తున్న 50 కోట్ల మంది కార్మికులను ఆదుకునే చర్యలు లేకపోతే వారిని ఇబ్బంది పెట్టే అనేక కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. దేశానికి విశ్వ గురువుగా ప్రపంచంలోనే భారత్‌ను మూడవ ఆర్థిక దేశంగా తీర్చిదిద్దుతున్నామని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 85 కోట్ల మంది పేద ప్రజలకు ఉచిత రేషన్ ఇస్తూ ప్రపంచంలోనే మూడవ ఆర్థిక దేశంగా ఎలా నిలబెడతావని ప్రశ్నించారు. దేశంలో ఉన్న ప్రభుత్వంగా సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తూ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ దేశాన్ని నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని ప్రొఫెసర్ సాయిబాబు లాంటి వ్యక్తులను అక్రమంగా జైల్లో

పెట్టించి ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఉపముఖ్యమంత్రి మనిష్‌సిషోడియా లాంటి వారిని సైతం అన్యాయంగా అరెస్ట్ చేశారని అన్నారు. రాజకీయ అవసరాల కోసం నిత్యం అబద్ధాలు చెబుతూ నమ్మించి మోసం చేయడంలో మోడీని మించిన వారు లేరన్నారు. దేశంలో ఉన్న కార్మిక చట్టాలను 44కు కుదించి అందులో 29 చట్టాలను అదృశ్యం చేశారని అన్నారు. అంతకు ముందు జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం నివేదికను సమర్పించారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అచ్యుతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సమితి సభ్యులు డాక్టర్ బూసిరాజు, సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు, కోనలక్ష్మణ, ఎల్వీ రమణ, పెంటకోట సత్యనారాయణ, రెడ్డిపల్లి అప్పలరాజు, సన్యాసిరావు మాస్టర్, కోరిబిల్లి శంకరరావు, పణీంధ్ర, శ్రీరామదాసు అబ్బులు, తాకాశీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీస్ కవాతు

విశాలాంధ్ర - యస్.రాయవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. నక్కపల్లి సిఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో మండలంలోని యస్.రాయవరం, సర్వసిద్ధి, సైతారు పేట, జె.వి. పాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు ప్రదర్శన చేసి ఎన్నికల సన్నద్ధతపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఏ. విభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న హయాంలో అభివృద్ధి భేష్

విశాలాంధ్ర - గొలుగొండ: అభివృద్ధి విషయంలో అయ్యన్నకు సాటిలేదని వైసీపీ చేసింది గోరంతని టీడీపీ మాజీ జెడ్పీటీసీ చిటికెలు తారక వేణుగోపాల్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎల్ పురం గ్రామంలోనే 55 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, బస్సు షెల్టర్, అంగన్వాడి కేంద్రాలు, అల్లూరు పార్కు అభివృద్ధి, హైస్కూల్లో కంటైనర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వంటి అభివృద్ధిని అయ్యన్నపాత్రుడు ఐదేళ్లలో చేశారని అటువంటి నాయకుడ్ని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే గణేష్‌కు లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంప వాసు, లగుడు రమేష్, బొడ్డు జమీలు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి భగత్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉరికంబాన్ని నవ్వుతూ ముద్దాడిన భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బీసీ మహిళ వసతి గృహంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా హాస్టల్ వార్డెన్ నవీన ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే స్వాతంత్ర ఉద్యమం పట్ల ప్రేరణ పొంది, శ్వేత జాతి పాలన పట్ల విముఖత పెంచుకున్నారని అన్నారు. ప్రతి యువకుడు భగత్ సింగ్, రాజ్ గురు సుకుదేవుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఈ దేశ పురోభివృద్ధికి పాటు పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి. బాబ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: భగత్‌సింగ్ సాహసం నేటి తరం యువతకు స్ఫూర్తి అని సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యన్నారాయణ అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పరవాడ సంతబయలు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన భగత్ సింగ్ త్యాగం చిరస్మరణీయమన్నారు. సిఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీటు నాయకులు వాసంశెట్టి రవి, వాసంశెట్టి దేవరాజు, ఎ.నాగరాజు, ఈశ్వరరావు, శంకర్, ముని తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా నక్కపల్లిలో సిఐటీయు కార్యాలయం వద్ద భగత్ సింగ్ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లని కొనియాడారు. నేడు సమాజంలో పెరిగిపోతున్న కార్పొరేట్ దోపిడీపై, అసమానతలు పెరుగుతున్న నిరుద్యోగం, దారిద్ర్యంపైన నేటి యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రమణ, కె.దుర్గ, జె.అప్పన్న, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్వాతంత్ర్య సమరయోధులు విప్లవ వీరులు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ 93వ వర్ధంతిని మండల కేంద్రంలో శనివారం సిఐటియు నాయకులు ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ చిత్రపటానికి సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, ఐకెపి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రూపాదేవి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. విప్లవ వీరుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత హక్కుల సాధనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్ రాజు, త్రినాథ్, రాజేష్, రాజ్యలక్ష్మి, వనిజ, మీనాక్షి, గంగా, అంగన్వాడి ఆశ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని జర్నలిస్టుల దేశవ్యాప్త కోర్కెల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని జర్నలిస్టులు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎ.పి.యు. డబ్ల్యూ.జె.) అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు కుబిరెడ్డి రాధాకృష్ణ, చోడవరం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్ ఆధ్వర్యంలో ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాలని, వర్కింగ్ జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేజ్ బోర్డును నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు జి.బాల గంగాధర్, ఎస్.వెంకట రావు, డి.నరసింగరావు, ఎస్.సతీష్, ఎన్.శ్రీను, ఎస్.నారాయణ, బి.సత్యనా రాయణ, ఎన్.అప్పారావు, వి.పరమేష్, జి.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని కోర్కెల దినంగా పాటిస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం యలమంచిలి తహశీల్దార్ ఆర్.అప్పల రాజుకు యలమంచిలి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూ డబ్ల్యూజే యలమంచిలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బి.అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీమాన్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు డి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.మూర్తి, ఏబీఎల్ రాజు, సంతోష్, నాయుడు, లోకేష్, గణేష్, రాము, చెన్నాజీ, రాజేష్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 30 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలం రాచపల్లి పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామం నుండి సుమారు 30 కుటుంబాలు రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబు మాజీ మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి సమక్షంలో వైసీపీ నుండి టీడీపీలో చేరారు. వారికి విజయ్ బాబు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అల్లు రామునాయుడు, రాచపల్లి సీనియర్ నాయకులు జోగిపాత్రుడు, జమిందార్, గిరి, వెంకీయ్యపాలెం టీడీపీ నాయకులు అడిగర్ల శ్రీను, అడిగర్ల రమణ పాల్గొన్నారు.

పాడిరైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ అండగా ఉంటుందని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. శనివారం మండలంలో భోగాపురం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడిరైతుల పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డెయిరీ వైద్యులు మనోజ్ కుమార్ పశువులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ పాడిపశువుల ఆరోగ్య రక్షణకు డెయిరీ కృషి చేస్తుందన్నారు. పాడిరైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలుకు అన్ని డెయిరీల కంటే హెరిటేజ్ అధిక ధర చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాము, రమణ, శ్రీను, సంజీవరావు, వెంకట్రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: ఎంపీడీఓ

విశాలాంధ్ర - చీడికాడ: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని కోణాం, శిరిజాం, ఖండివరం, అప్పలరాజుపురం, జి.కొత్తపల్లి గ్రామాల చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు, శిలాఫలకాలు ఉండరాదన్నారు. ఇవి ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉమా సంతోష్ పాల్గొన్నారు.

33 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - పరవాడ: అక్రమంగా మద్యం కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులపై శనివారం పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.బాల సూర్యారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకెలపాలెం గ్రామానికి చెందిన షేక్ రాముతో పాటు ముత్యాలమ్మ పాలెం గ్రామానికి చెందిన సూరాడ కృష్ణమ్మ, చింతకాయల భారతి ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి అమ్మేందుకు వారి గ్రామాలకు తీసుకు వెళుతుండగా మార్గం మధ్యలో సీఐ బాలసూర్యరావు, ఎస్సైలు సురేష్, మల్లేశ్వరరావు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో షేక్ రాము వద్ద రూ.2754 విలువ గల 18 మద్యం సీసాలు, సూరాడ కృష్ణమ్మ వద్ద రూ.765 విలువ గల 5 మద్యం సీసాలు, చింతకాయల భారతి వద్ద 1530 విలువ గల 10 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. పట్టుబడ్డ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టణంలో ఎన్నికల అధికారులు తనిఖీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలో వాలంటీర్లకు డబ్బులు పంచుతున్నారనే ఫిర్యాదుతో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి విజయలక్ష్మి వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు ఇంట్లో తనిఖీ నిర్వహించారు. అయితే అధికారులు వెళ్లే సమయానికి ముఖ్య నాయకులతో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఇంతలో విజయలక్ష్మి సిబ్బందితో లోపలకు వెళ్ళగా ఏ అధికారంతోకి లోపలికి వచ్చారని బొడ్డేడ ప్రసాద్ ప్రశ్నించారు. వాలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అం దిందని వారి ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించేందుకు వచ్చానని తెలిపారు. ఇంట్లోకి వెళ్లి తనఖీ నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించగా, బీరువాలను తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి డబ్బు దొరకలేదు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి సమావేశాలు నిర్వహించుకోవాలంటే అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అక్కడి ఉన్న వారిని, పరిస్థితులను వీడియా చిత్రీకరించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయారు.

4 కేసుల్లో 5,400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

విశాలాంధ్ర - పాయకరావుపేట: అంతర్ జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు నిర్వహించిన దాడుల్లో 5,400 లీటర్ల బెల్లం పులుపు, 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, సెబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్, ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ జయసింహా చౌదరిలకు వచ్చిన ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజ రాణి ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం, పాల్మన్ పేట, ఈదటం గ్రామ సమీపంలో అక్రమ నాటు సారా తయారీకి ఉపయోగపడే బెల్లం పులుపు 1000 లీటర్లు, అలాగే కాకినాడ జిల్లా, తుని సెబ్ స్టేషన్ పరిధిలోని తుని మండలం, వేమవరం గ్రామ సమీపంలో 1800 లీటర్లు, పంపడిపేట గ్రామ సమీపంలో 1400 లీటర్ల బెల్లం పులుపు, 20 లీటర్ల నాటుసారా, ఎర్రయ్య పేట గ్రామ సమీపంలో 1200 లీటర్ల బెల్లం పులుపు, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం 5,400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులలో అనకాపల్లి ఏ.ఈ.ఎస్ డి.శైలజ రాణి, ఏ.ఈ.ఎస్ ఏ.ఎస్.దొర, అనకాపల్లి జిల్లా డి.టి.ఎఫ్ ఇన్స్పెక్టర్ షేక్ మీరా సాహెబ్, పాయకరావుపేట సెబ్ స్టేషన్ ఎస్సై పి.జాన్ ప్రసాద్, ఎలమంచిలి సెబ్ స్టేషన్ ఎస్సై ఏ.శ్రావణ్ కుమార్, కాకినాడ జిల్లా, తుని సెబ్ స్టేషన్ ఎస్సై పి.చిట్టిబాబు, కాకినాడ జిల్లా, డి.టి.ఎఫ్ ఎస్సై షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గొన్న కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం గొన్న కళాశాలలో బీటెక్ విద్యార్థుల ఫేర్ వెల్ డే వేడుకని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులందరూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థులు తమ తమ అనుభూతులను అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ గొన్న హేమచంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుని పూర్తి చేయగానే సఫలీకృతులు అయినట్లు కాదని, ఉన్నత స్థాయి పొందినప్పుడు చదువుకి ఒక అర్థం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు అంతా ఇన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్ ఎన్ మూర్తి, విభాగ అధిపతులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాపులో పైలా

విశాలాంధ్ర - వి.మాడుగుల: మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచే ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులకు శనివారం విజయవాడలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థులకు ఉండే హక్కులు, అధికార పక్ష కుట్రలు మీద అభ్యర్థులకు వర్క్ షాప్‌లో దిశా నిర్దేశం చేశారు. టిడిపి, జనసేన, బిజెపి మాడుగుల అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు ఈ వర్క్ షాప్‌నకు అబ్జర్వర్ కర్రోతు నర్సింగరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పైలా పలువురు సీనియర్ నేతలను కలుసుకుని వివిధ అంశాలను చర్చించారు.

ఘనంగా ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జ్యోతి, పీహెచ్‌సి వైద్యాధికారులు డి.సుభాష్, సౌందర్య, సిబ్బంది పివి రమణ, ఎం.నాగేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర - చోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా చోడవరంలో శనివారం పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తూ జల్లెడ పట్టారు. రాజకీయ పార్టీ నేతలు, వారి అనుచరుల కదలికలపై నిఘా వుంచారు. ఓటర్లకు తాయిలాలు ఇచ్చి, గాలం వేసేందుకు సిద్ధమైన నేతలకు కునుకు పట్టకుండా చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలందరూ సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం పోలీసులకు అందించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలలో పూర్తి మౌలిక వసతులు వుండాలి: జేసీ జాహ్నవి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాలు పూర్తిస్థాయిలో మౌలికవసతులు కలిగి వుండాలని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టరు ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో అనకాపల్లి జోనల్ కమిషనర్, ఎ.ఈ.ఆర్ఒలు, సెక్టార్ అధికార్లు, ఎంపిడిఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా 'స్వీప్' ద్వారా అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. పదిరోజులలో ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జివియంసి జోనలల్ కమిషనర్ వి.ఐ.పి.ఐ.నాయుడు, తాశీల్దార్ఎల్.మధుసూధన, ఎంపిడిఓలు మోహన్ కుమార్, శేషుబాబు, డి.టి. జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అన్నింటికీ తలూపితే తంటా..

వాలంటీర్లూ.... తస్మాత్ జాగ్రత్త!

విశాలాంధ్ర-పరవాడ: డివిజన్లలో ప్రచారం నిర్వహించాలంటే వారే.. తాయిలాల పంపిణీ చేయాలంటే వారి సహకారమే.. సామాజిక మాద్యమాల్లో డప్పుకొట్టాలన్నా వారి వైపే చూపు... అధికార పార్టీ కార్యక్రమాలను అన్నీ తామై నడిపిస్తున్నది. కొందరు,, తప్పక పనిచేయాల్సిన పరిస్థితిలో మరికొందరు వాలంటీర్లు తలూపుతున్నారు. వైకాపా నాయకులకు ఇన్నాళ్లు లేని అభిమానం ఈ వ్యవస్థపై పుట్టుకొచ్చింది. ఓట్ల కోసం వీరిని బలిపశువులను చేస్తూ భవితతో బంతాట ఆడుతున్నారు. అధికార పార్టీకి చెందిన 77వ వార్డు కార్పొరేటర్ ఆ వార్డు వాలంటీర్లతో 79వార్డులోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని జనసేన, టీడీపీ నాయకులు బట్టబయలు చేసిన సంగతి తెలిసిందే. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్ తన ఇంట్లో వైసీపీ నాయకుల సమక్షంలో వాలంటీర్లతో నేరుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం ఎన్నికల అధికారుల వరకు తీసుకు వెళ్లనున్నట్లు జనసేన టీడీపీ నాయకులు వెల్లడించారు.

50 కుటుంబాల ఓట్ల కోసం...

వాలంటీర్ల పరిధిలో ఉండే 50 ఇళ్ల ఓటర్లు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండే క్రమంలో వాటి ద్వారా ప్రచారానికి తెరతీశారు. ఈ విషయాలను ఎన్నికల కమిషన్ ఎప్పటి కప్పుడు గమనిస్తునే ఉంది. వాలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల విధుల్లో చేర్చకూడదని స్పష్టమైన ఆదేశాలున్నాయి. తెలిసీ తెలియక ప్రచారాలు, కానుకలు చేరవేయడం వాలంటీర్లు చేస్తే ఎన్నికల అధికారులు కేసులు సైతం నమోదు చేసే అవ కాశం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల వాలంటీర్లను ఆర్వో తొలగించినప్పటికీ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. పైగా విధుల నుంచి తొలగిస్తే వాలంటీర్ల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తానని చెబుతున్నారట. అయిదేళ్లుగా లేని అభిమానం ఇప్పుడు పుట్టుకొ చ్చిందని, కేవలం ఎన్నికల కోసం వారి భవిష్యత్తును పణంగా పెట్టేందుకు కూడా వెనుకాడడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భవిత ముప్పు..

పాలనను ప్రజలకు మరింత దగ్గరగా అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇదే వ్యవస్థ అధికార పార్టీ ప్రచారానికి కార్యకర్తలను మించిపోయింది. పెందుర్తి నియోజకవర్గంలో వార్డు, పంచాయితీల్లో ఉన్న ఒక్కొక్క సచివాలయంలో 15 నుంచి 25 మంది వరకూవాలంటీర్లున్నారు. కేవలం వారిని ప్రజా సేవల కోసం అవగాహన కల్పించే ప్రక్రియలో మాత్రమే విధుల్లోకి తీసుకున్నారు. అధికార పార్టీ నాయకులు మాత్రం వీరిద్వారా ఎన్నికల వేళ పనులు చక్కబెట్టగలమనే ఉద్దేశంతో తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ప్రచారానికి వినియోగిస్తునే ఉన్నారు. ఎన్నికల కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఈ విధానం ప్రవర్తనా నియమావళికి పూర్తిగా విరుద్ధం కావడంతో వాలంటీర్లను విధుల్లోంచి తొలగించక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. శ్రుతిమించితే కేసులూ పెట్టొచ్చు.. వేరొక ఉద్యోగం సంపాదించే వరకూ ఉన్న చోటనే ఖర్చులనిమిత్తం ఎంతో కొంత వస్తుందనే ఆశతో డిగ్రీ, పీజీ చదివినవారు కూడా ఇలా వాలంటీర్ల వ్యవస్థలో ఉన్నారు. వారికి రాజకీయాలు అలవాటు చేసి ప్రతిపక్షాలపై ప్రతీకార దిశగా అధికార పార్టీ నేతలు ఉసిగొల్పుతున్నారు. దీనివల్ల వారి భవిష్యత్తు ఇబ్బందుల్లో పడే ప్రమాదముంది. కొందరు తెలిసి ప్రచారంలో పాల్గొంటే, ఎన్నికల నియమావళి తెలియని మరి కొందరు అధికార పార్టీ నేతలు చెప్పిన దానికల్లా తల ఊపుతున్నారు. ఒక్కసారి కోడ్ అమల్లోకి వచ్చాక ఎన్నికల జరిగే వరకూ పాలనా వ్యవహారాలు అన్నీ అధికారుల చేతుల్లోకి వస్తాయి. ఎన్నికల సమయంలో ఇలాంటి పరిస్థితులు శ్రుతిమించితే కమిషన్ నేరుగా కేసులు కూడా నమోదు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఆ ప్రభావం వాలంటీర్ల భవిష్యత్తుపై పడే ప్రమాద ముందనే మాట వినిపిస్తోంది.

క్రైమ్ సీన్ అబ్జర్వేషన్ తో నిందితులను గుర్తించడం సులభం

జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి (సబ్బవరం): దర్యాప్తు అధికారి క్రైమ్ సీన్ అబ్జర్వేషన్తో నిందితులను గుర్తించడంలో ముఖ్యపాత్ర వహిస్తుందని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. సబ్బవరంలో గల దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ లీగల్ ఇంక్యూబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్-5.0 నేషనల్ లీగల్ కాంపిటీషన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.న్యాయవాద వృత్తిలో రాబోయే సవాళ్లు ఎదుర్కోవడం అవకాశాలకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ప్రాముఖ్యత వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి పోటీల వలన కళాశాల విద్యార్థులకు విజ్ఞానం, నైపుణ్యం మెరుగుపరచు కోవాలన్నారు. కేసులు దర్యాప్తు , చట్టాన్ని అమలు చేయడంలో కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.సూర్య ప్రకాష్ రావు, ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, కో కన్వీనర్ డాక్టర్ సి. హెచ్. లక్ష్మి, లా యూనివర్సిటీ ఫ్యాకల్టీ మెంబర్స్, పరవాడ సబ్ స్టేషన్ డీఎస్పీ శ్రీ కె.వి. సత్యనారాయణ, సబ్బవరం ఇన్స్పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు

కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి ప్రసాదు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి, మత్స్యశాఖ డి.డి పి.ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. 08924-22655599 నెం.తో ల్యాండ్ లైన్ ఫోన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలకు సంబంధించి ఏ గ్రీవెన్స్ నైనా ఈ ఫోన్నం.కు ఫోన్చేసి తెలియజేయవచ్చన్నారు. ఇప్పటికే అందుబాటులో వున్న టోల్ఫ్రీ నం.1950 కూడా అందుబాటులో వుంటుందని చెప్పారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి గ్రీవెన్స్ తెలియజేయడానికి 24 గంటలు అందుబాటులో వుంటుందని చెప్పారు.

నేటి నుంచి వైకాపా అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం

వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: వైకాపా అభ్యర్థి కంబాల జోగులు ఆది వారం ఉదయం నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామం గొల్లపేట కృష్ణుడు ఆలయం వద్ద నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న గొల్ల బాబూరావును రాజ్యసభకు పంపడంతో ఆయన స్థానంలో విజయనగరం జిల్లా, రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు ఇక్కడ టిక్కెట్టు కేటాయించారు. కంబాల జోగులుది పార్వతిపురం మన్యం జిల్లా, పాలకొండ నియోజకవర్గం, మంగలాపురం స్వగ్రామం. 2004లో రాజకీయ రంగ ప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీ తరుపున పాలకొండలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రజారాజ్యం తరుపున రాజాం నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014, 2019లలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరుపున రాజాం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సమన్వయకర్తగా నియమించిన నాటి నుండి, టిక్కెట్టు ఖరారు అయిన తర్వాత కూడా కంబాల జోగులు నియోజకర్గంలో పర్యటిస్తున్నప్పటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదు. సెంటిమెంటుగా శ్రీరాంపురం పాయక రావుపేట మండలంలోని శ్రీరాంపురం గ్రామం నుండి సెంటిమెంటుగా భావించి ఎన్నికల ప్రచారాన్ని అక్కడి నుండి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు తెలిపారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలు, 2019లో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థి గొల్ల బాబూరావు శ్రీరాంపురం గొల్లపేట నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని తెలిపారు. 2014లో జరిగిన ఎన్నికల్లో చెంగల వెంకట్రావు పాల్మాన్పేట నుండి ప్రారంభించి ఓటమి పాలయ్యారని తెలిపారు. కంబాల జోగులు ఎన్నికల ప్రచారం ఘనంగా ప్రారంభిస్తున్నామని చిక్కాల రామారావు తెలిపారు. దీంతో రాజకీయ పార్టీలకు మండలంలోని పాల్మాన్పేట గ్రామం నుండి ఎన్నికల ప్రచారం సెంటిమెంటు మారినట్లు అయ్యింది. టిడిపి అభ్యర్థి వంగలపూడి అనిత కూడా పాయకరావుపేట మండలం సీతారాంపురం నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

రామ్చరణ్ను కలిసిన లంక..

విశాలాంధ్ర-నక్కపల్లి: జిల్లా మెగా యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక శ్రీనివాసరావు విశాఖలో జరిగిన ఒక కార్యక్రమంలో మెగాస్టార్ తనయుడు రామ్చరణ్ను మర్యాద పూర్వకంగా కలిశారు. చిరంజీవి మెగా యూత్ చేపట్టే పలు కార్యక్రమాలను ఆయనకు తెలియజేశారు.

అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టిన బొలెరో

స్పాట్లో ఒకరు, చికిత్సపొందుతూ మరొకరు మృతి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: మండలంలోని శంకరం జాతీయ రహదారిపై అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని బలోరా వాహనం ఢీకొట్టిన సంఘటనలో ప్రమాద స్థలంలో ఒకరుచ చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వివరాలివి. దేవరాపల్లి మండలం కాశిపురం గ్రామానికి చెందిన పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు, అప్పారావు, మరొక మేస్త్రి పెందుర్తి నుంచి ఎలమంచిలి టైల్స్ లోడుతో బొలెరోలో ఎలమంచిలి వెళు తుండగా మార్గమధ్యలో శంకరం వద్ద అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో పూడి గంగునాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, ఆదిరెడ్డి గంగు నాయుడు ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. వీరితో పాటు బొలెరోలో ఉన్న డ్రైవరు మరొక మేస్త్రి సురక్షితంగా బయటపడ్డారు. మరో క్షతగాత్రుడు అప్పారావును కేజిహచ్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం

విశాలంధ్ర-అచ్యుతాపురం : కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజల సంక్షేమం కోరు కుంటుందని యలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త , అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు తనకాల అనంతరావు అన్నారు . శనివారం వెదురువాడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఇంటింటికి మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ ఇందిరమ్మ అభయం యాప్ లో వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళకు రూ 5000 కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలవుతుందని , ప్రతి ఒంటరి మహిళలకు సంవత్సరానికి లక్ష రూపాయలు పథకం హామీ ఇచ్చారని తెలిపారు . ప్రశ్నించవలసిన ప్రతిపక్షాలు మెదపడం లేదన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్ , మండల సోషల్ మీడియా నాయకులు మణికంఠ , కార్యకర్తలు శరగడం దుర్గనాయుడు , బీసెట్టి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో సీతంపాలెం గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం వందలాది భక్తులను ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలను నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా రాజం శాసనసభ్యులు ,ప్రస్తుత పాయకరావుపేట నియోజకవర్గం వైకాపా అభ్యర్థి కంబాల జోగులు అమ్మవారిని దర్శించుకోవడానికి రావడంతో వారిని సర్పంచ్ గొర్ల నాగ అప్పలరాజు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, గొర్ల దుర్గ, పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు .ఆయనతోపాటు దర్శించుకున్న వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ జడ్పీటిసి గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షులు సీరం నరసింహమూర్తి, పార్టీ నాయకులు సర్పంచులు కొలకలూరు సురేష్ వర్మ ,సాదిరెడ్డి శ్రీను, వెదుళ్ళ రమణ, తల్లా భార్గవ్, రెడ్డి వరహాలు, ఎంపిటిసి సభ్యులు లొడగల చంద్రరావు, జిల్లా విద్యార్థి విభాగపు చైర్మన్ కొప్పిశెట్టి హరిబాబు, గొర్ల బాబురావు, కొవిరి రమణ, సిద్ధ బత్తుల సూకతాత, తదితరులు దర్శించుకున్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు గొర్ల గోవిందు, గొర్ల నాగ అప్పలరాజు, గొర్ల దుర్గ లు కలిసి రామకృష్ణ చేతుల మీదుగా కంబాల జోగులను సత్కరించారు.

భగత్సింగ్ పౌరుషాన్ని యువత తమ జీవితాల్లో ఇనుమడించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: భగత్సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా అనకా పల్లి దొడ్డి రామునాయుడు భవన్లో డివైఎఫ్ఐ బిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన 93వ వర్ధంతి సభలో భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ ఉమ్మడి విశాఖ మాజీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మాజీ జిల్లా నాయకులు ఆర్.శంకరరావులు, సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెస్.శివాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధి కారి ఎస్. రమణ పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా కె.లోకనాథం, పరమేష్ మాట్లాడుతూ .స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న అనేకమంది ఉద్యమకారులు ఈ దేశానికి పరిమితి కలిగిన స్వాతంత్ర్యం వస్తే చాలని అనుకున్నారు. కానీ భగత్సింగ్ మాత్రం ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించాడని తెలిపారు. దోపిడీ, వివక్ష, మతమౌఢ్యం, పేదరికం, కుల కుటిలత్వం లేని సమసమాజం కావాలని కోరుకున్నాడు. మానవత్వం, ధైర్యం, తెగువ, ప్రేమ, త్యాగం, అంకితభావం, అధ్యయనం, అభ్యుదయం, మతసామరస్యం, శ్రామికవర్గ దృక్పథం, తన ఆలోచనలపై విశ్వాసం భగత్ సింగ్ సొంతం అని అన్నారు. నిరాశానిస్పృహలు దరిచేరని జీవితం భగత్ సింగ్ది అని భగత్సింగ్ పౌరుషాన్ని యువత తమ జీవితాల్లో ఇనుమడిపజేసుకోవాలనీ పిలుపు నిచ్చారు. 18 ఏళ్ళకే భారత స్వాతంత్ర్యోద్యమానికి అంకితమై 23 ఏళ్ళ చిరుప్రాయంలో తన ప్రాణాలను సైతం చిరునవ్వుతో ఉరికంబానికి అర్పించిన భగత్ సింగ్ బాటలో నేటి యువత దేశాభివృద్ధిలో తమ పాత్ర ఏమిటని తమను తాము ప్రశ్నించుకునిపాలకులను ప్రశ్నించాలని అన్నారు.నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భగత్ సింగ్ ఆశయాలకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎస్.రమణ మాట్లదు తూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు యువత ఆలోచనలను మరింత మొద్దు బార్చేందుకు చూస్తున్నాయి. దానిలో భాగంగానే పుస్తకాల్లోని పాఠ్యాంశాలను మార్చి మతమౌడ్యాన్ని పెంచిపోషించే పాఠ్యాశాలను చేరుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏ.రాజు, బి.శివ, జి తరుణ్,కుమార్, చలపతి, మోహన్,గోపి, ఎస్ఎఫ్ఐ రమేష్, కార్తిక్, లు విద్యార్దులు,యువకులు పాల్గొన్నారు.

విప్లవ వందనాలతో.... ఘనంగా భగత్సింగ్ 93వ వర్ధంతి

చోడవరం: విప్లవ అభివందనాలతో శనివారం స్థానిక ఉషోదయ కాలేజీ లో వి.డి.ఎస్.ఒ. - నవయువ సమాఖ్య (ఎన్.వై.ఎస్.) ఆధ్వర్యంలో ఘనంగా విప్లవ వీరుడు భగత్ సింగ్ 93 వ వర్ధంతి నిర్వహించారు. అనం తరం ఏర్పాటు చేసిన సభలో నవ యువ సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎన్.భాస్కర్ మాట్లాడుతూ నాడు విదేశీ వస్తువుల్ని తగులపెట్టి, బ్రిటిష్ వాళ్ళని మన దేశం నుండి తరమాలని పోరాడితే, నేడు మన దేశ పాలకులు దేశ సహజ, అటవీ, ఖనిజ సంపదలను విదేశీ సామ్రాజ్యవాద కంపెనీలకి కట్టబెడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేసి, యువతను విద్యా, ఉపాధికి దూరం చేస్తూ ఆ విదేశీ కంపెనీలకు కావలసిన కారుచౌక కూలీలుగా దేశ యువతను తయారు చేస్తున్నారన్నారు. అతి చిన్న వయసులోనే సోషలిస్ట్ వ్యవస్థ నిర్మాణం కోసం అసువులు బాసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల స్ఫూర్తితో అందరికీ విద్యా, వైద్యం, ఉపాధి హక్కుకై పోరాటమే భగత్ సింగ్ కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. వి.డి.ఎస్ ఒ.జిల్లా కో - కన్వీనర్ వి.మౌనిక మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాలుగా మన పాలకులు సామ్రాజ్య వాద విధానాలనే అమలు చేస్తున్నారని, వాటి ఫలితంగా నేడు ప్రజల జీవితాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. పాలకుల దోపిడీ పీడనల గూర్చి విద్యార్థులు ఆలోచించనీయకుండా దేశభక్తి ముసుగులో జాతి, కుల, మత, ప్రాంతీయ ఉన్మాదా లను నర నరాల్లో నింపుతున్నారని తెలియ జేశారు. భారతదేశ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, రాజు గురు, సుఖ్ దేవ్ ల ఆశయాలను నేటి యువత భుజానికి ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

అచ్యుతాపురం : భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం మోసయ్య పేట పంచాయతీ శివారు కొత్తూరు గ్రామంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రీ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరావు మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్పొరేట్శక్తులు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలుపై భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే సోము నాయుడు, కదారి అప్పారావు, చందకు నరసింహమూర్తి, సింహాద్రి , చుక్కల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు .

మాడుగులలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినం

విశాలాంధ్ర-మాడుగుల: మాడుగులలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని కోర్కెల దినంగా పాటిస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం మాడుగుల తహసిల్దార్ టి.సత్యనారాయణకు మాడుగుల ప్రెస్ క్లబ్.ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, మీడియా సంస్థలు, జర్నలిస్ట్ల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ కు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు ఉన్న విలేఖర్లకు కనీసం రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న విలేఖర్లకు గతంలో ఇచ్చి రద్దు చేసిన రైల్వే పాస్లు పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు రొబ్బా శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు లీడర్ సురేష్, కరణం నారాయణరావు, కుప్పిలి భవాని శంకర్, తాకాశి శ్రీను, గొర్లి శివ, మజ్జి సతీష్, దర్మిశెట్టి పైడినాయుడు, దాసరి అచ్యుతరావు, వారాధి శివ, మణికంఠ, తేటకుల

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఏపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ

విశాలాంధ్ర-పాయకరావుపేట: భగత్సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని పాయకరావుపేట ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినం నిర్వహించారు. ఈసందర్భంగా పాయకరావుపేటలో తహశీల్దార్ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు మాట్లాడుతూ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని, మీడియా సంస్థలు, జర్నలిస్ట్ భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలని, వర్కింగ్ జర్నలిస్ట్ లకు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వాలని, 60ఏళ్లు దాటిన జర్నలిస్టులకు కనీసం రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చి రద్దు చేసిన రైల్వే పాస్లు పునరు ద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి శ్రీ ని వా స కు మా ర్, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు వెలగా లోవరాజు, అధ్యక్ష, కార్యదర్శులు కుందూరు రాణా, సేనాపతి లోవరాజు, జర్నలిస్టులు కిల్లాడ జ్యోతిరాజు, వెలగా సత్యనారాయణ, పల్లా ప్రసాద్, పెదిరెడ్డి చంద్రశేఖర్, కె.నాగార్జున, ఎస్.రాము, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సత్యనారాయణ, అక్కిరెడ్డి నాగేశ్వరరావు, కోదండ, నానాజి, కొవిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చెట్టు నుండి జారి పడి వ్యక్తి మృతి

మృతి చెందిన ఏసు

విశాలాంధ్ర-పాయకరావుపేట: చెట్టు నుండి జారి పడి పాయకరావుపేట పట్టణానికి చెందిన కల్లు గీత కార్మికుడు గుర్రుర్తి ఏసు(43) మృతి చెందినట్లు ఎస్సై జోగారావు తెలిపారు. ఏసు తన వృత్తి కల్లు గీనుకునేందుకు శ్మశానం సమీపంలో చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

తెలుగు భాషకు సారస్వత స్థాయి కల్పించిన మహాకవి నన్నయ్య

పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మిప్రసాద్

ఖాజీపాలెం కెవిఆర్, కెవిఆర్, ఎంకెఆర్ కళాశాలో ఘనంగా నన్నయ్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-విశాఖపట్నం: తెలుగు భాషకు సారస్వత స్థాయి కల్పించిన ఘనత మహాకవి నన్నయ్యకే దక్కుతుందని పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ అన్నారు. వెయ్యి సంవత్సరాల క్రితమే తెలుగు భాషకు నన్నయ్య సాహితీ గౌరవాన్ని కల్పించారన్నారు. బాపట్ల జిల్లా ఖాజీపాలెంలోని కెవిఆర్, కెవిఆర్, ఎంకెఆర్, కళాశాల 43వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అదికవి నన్నయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి యార్లగడ్డ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తెలుగు పద్య సౌందర్యాన్ని తొలుత ప్రపంచానికి చాటింది నన్నయ్య మాత్రమేనన్నారు. సంస్కృతీ పదాలతో పాటు దేశీయ పదాలను సైతం పద్యంలో అంతర్భాగం చేసే అక్షరాన్ని ననయ్య రమ్యంగా మార్చార న్నారు. రాజమండ్రి అదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తదుపరి ఆంధ్రప్రదేశ్ లో నన్నయ్య విగ్రహావిష్కరణకు బాపట్ల జిల్లా వేదిక కావటం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఎం నరసరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస కుమార్, ప్రిన్సిపల్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఫాల్గుణ పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర-విశాఖ : విశాఖలో ప్రసిద్ధి చెందిన కేజీహెచ్ ఇసుక కొండపై కొలువైన శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 25న ఉత్తర, హస్తా నక్షత్రం సహితమైన అరుదైన హెరాలీ పర్వదినం ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకొని ధ్వజస్తంభం ప్రదక్షిణ పూజలు, విశేష అభిషే కాలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వ హణ అధికారి బుద్ధ లక్ష్మి నగేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 25న తెల్లవారుజామున నాలుగు గంటలకు వేద మంత్రాలతో ధ్వజ స్తంభం పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజ అనంతరం ధ్వజ స్తంభం చుట్టూ వంచ ప్రదక్షిణ, తొలిదర్శనం స్వామి భక్తులకు కల్పించ బడుతుందని తెలిపారు. ఉదయం 4 నుండి మధ్యాహ్నం 2 వరకు, మరల సాయంత్రం 4 నుండి రాత్రి 10 వరకు సత్యనారాయణ స్వామిని దర్శనం చేసుకొనవచ్చునని తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించే భక్తులకు మొదటి, మూడవ బ్యాచ్ ఉదయం 7 గంటలకు, తిరిగి 10-30 కు విశేష ప్రత్యేక వ్రతములు నిర్వహింపబడునన్నారు. రెండవ బ్యాచ్ 8-30 కి సాధారణ వ్రతములు నిర్వహించబడతాయని తెలిపారు. వ్రతాలు చేయించుకొనేవారు రెండు కొబ్బరి కాయలు, 6 అరటి పళ్ళు, కొన్ని విడిపువ్వులు తెచ్చుకోనవలెనని తెలిపారు. అత్యంత విశేషమైన ఫాల్గుణ మాస పౌర్ణమి రోజున ఎవరియితే కష్టాలు, బాధలు, నష్టాలు పడుతున్నారో వారు శ్రీ సత్యనా రాయణ స్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించి, ప్రదక్షిణ, వ్రతాలు ఆచరించి సుఖ సంతోషాలు సిరి సంపదలు పొంద గలరని ఈవో బుద్ధ లక్ష్మీ నగేష్ తెలిపారు. భక్తులు తరలి వచ్చి శ్రీ సత్యనారాయణ స్వామిని దర్శనం చేసుకొని, ప్రదక్షిణలు ఆచరించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించాలని కోరారు.

వెంకమ్మపేట, గంగాపురం పరిధిలో టీడీపీ ప్రచారం

విశాలాంధ్ర -పార్వతీపురం: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మన ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్చంద్రను గెలిపించాలని టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్ర మౌళి, గొరజాన చంద్రమౌళిలు తెలిపారు. శనివారం వారు మండలంలోని వెంకమ్మపేట, గాంగాపురం పరిదిలో ఉపాధి హామీ పథకం పనులు జరిగే చోటకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపి మినీ మ్యానిఫెస్టో గూర్చి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పట్టణంలో టీడీపీ నాయకులు రవికుమార్, మజ్జి వెంకటేష్, బర్నాల సీతారాం, కోర్లెడ్ల నారాయణరావు తదితరులు ప్రచారాన్ని నిర్వహించారు.